
సాక్షి
బాపట్ల

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



అంకాలమ్మ తల్లికి బోనాలు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లికి గురువారం రాత్రి గ్రామస్తులు వైభవంగా బోనాలు సమర్పించారు.



నిండు కుండలా పులిచింతల

అచ్చంపేట : ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 4,28,115 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4,32,175 క్యూసెక్కులు వదులుతున్నారు.



ఉచిత ప్రసాద వితరణకు విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో ఉచిత ప్రసాద వితరణ పథకానికి గుంటూరు రెడ్డిపాలెంకు చెందిన తిరుమలశెట్టి భార్గవ తేజ రూ. 1,00,116 అందజేశారు.

న్యూస్‌రీల్

నల్ల బ్యాడ్జీలతో అటవీ సిబ్బంది నిరసన



నరసరావుపేట రూరల్: అటవీ శాఖ సిబ్బందిపై టీడీపీ ఎమ్మెల్యే దాడికి నిరసనగా పల్నాడు డివిజన్ సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈనెల 19వ తేదీ రాత్రి శ్రీశైలం శిఖరం చెక్‌పోస్ట్ వద్ద టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విధుల్లో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై దాడి చేశారు. దీనిని తీవ్రంగా ఖండించిన డివిజన్ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎమ్మెల్యేను, ఆయన అనుచరులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ డి.వి. రమణ, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అమీర్ జానీ బాషా, డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమర్చి జంతువుల వేట



బెల్లంకొండ: అటవీ ప్రాంతంలో విద్యుత్తు లైన్‌కు ఇనుప తీగలు అమర్చి జంతువులను వేటాడటాన్ని సిబ్బంది అడ్డుకున్నారు. మండలంలోని వెంకటాయపాలెం అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి విద్యుత్ లైన్‌కు కనెక్షన్ ఇచ్చి జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు తీగలను అమర్చారు. గమనించిన విద్యుత్ సిబ్బంది అక్కడకు వెళ్లగా పరారయ్యారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని సబ్ స్టేషన్ తరలించారు. వేటగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏఈ పవన్ కుమార్ తెలిపారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతం



మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం సామూహిక శ్రావణలక్ష్మి పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఆలయ ఈవో సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి తిరువంజనం, 9 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు స్వామి వారి వస్త్రాలు వేలం

శ్రీ లక్ష్మీనృసింహస్వామి, ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తులు సమర్పించిన వస్త్రాలను శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు దిగువ సన్నిధిలోని ఆలయ ఆవరణలో వేలం పాట ఉంటుందని ఈవో తెలిపారు.

గణేష్ ఉత్సవ సమితి కేంద్ర కార్యాలయం ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి కేంద్ర కార్యాలయం ప్రారంభమైంది. విజయవాడ గాంధీనగర్‌లోని హోమ్ ల్యాండ్ కల్యాణ చక్రవర్తి(పాత కల్యాణ చక్రవర్తి థియేటర్) నందు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగిల్ విండో పద్ధతిలో ఉత్సవాలకు అనుమతి ఇవ్వాలన్న ఉత్సవ సమితి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం అభినందనీయమన్నారు. హిందువులు సామూహికంగా నిర్వహించే గణేష్ నవరాత్రుల్లో, పండుగల్లో అనుమతుల పేరుతో ఇబ్బంది పెట్టకుండా ఈ విధానంలో 24 గంటల్లో అనుమతులు వస్తాయన్నారు. సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లకల్లోలంక గ్రామాలు

- వరద మరింతగా పెరిగే అవకాశం
- కొల్లూరు మండలం దోనెపూడి వద్ద లోలెవల్ బ్రిడ్జిపైకి నీరు
- కరకట్ట దిగువన పొలాల్లోకి నీరు
- 150 ఎకరాల్లో నీట మునిగిన అరటి, పసుపు, కంద, కూరగాయల పంటలు
- పలు లంక గ్రామాలకు రాకపోకలు బంద్
- అప్రమత్తమైన అధికారులు

ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 5.13 లక్షల క్యూసెక్కులు



కొల్లూరు మండలం పెసర్లంక - పెదలంక అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కృష్ణానదికి వరద పెరుగుతోంది. గురువారం ఉదయం ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు 5.13 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. దీంతో దిగువన కృష్ణా పరీవాహక ప్రాంతంలో పలు గ్రామాల పరిధిలోని పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. కొల్లూరు మండలం దోనెపూడి వద్ద ఉన్న లోలెవెల్ కాజవేపైకి నీరు చేరి ఆ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. వరద ప్రభావంతో చింతర్లంక, సుగ్గునలంక, పోతార్లంక గ్రామాల పరిధిలోని 150 ఎకరాల్లో సాగు చేసిన అరటి, పసుపు, కంద, కూరగాయల పంటలు నీటమునిగాయి. ఇదే ప్రాంతంలోని దాదాపు 200 ఎకరాల్లో పశువుల మేతతో పాటు ఇటుక బట్టీలను వరద ముంచెత్తింది. వరద ప్రభావంతో ఇప్పటికే పెసర్లంక, గాజుల్లంక, పోతార్లంక, సుగ్గునలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద పెరిగితే తోకలవారిపాలెం, పెదలంక, చింతర్లంకతోపాటు కొల్లూరు మండలంలో 18 గ్రామాలతోపాటు భట్టిప్రోలు మండలంలోని ఐదు గ్రామాలకు నీరు చేరే అవకాశముంది. ఎగువ నుంచి కృష్ణా నదికి 6లక్షల క్యూసెక్కులకు మించి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే లంకగ్రామాల్లోని వేలాది ఎకరాలలో పంటలు నీటమునిగే అవకాశముంది. వరద నీరు 7 లక్షల క్యూసెక్కులకు మించితేనే లంక గ్రామాలకు నీరు చేరే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. వరద మరింతగా పెరిగితేగే లంక గ్రామాలనుంచి ప్రజలను పునరావాసకేంద్రాలకు తరలించాల్సి ఉంటుంది. అధికారులు ఆదిశగా ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు.

నిలిచిన రాకపోకలు

భట్టిప్రోలు: కృష్ణా నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో భట్టిప్రోలు మండలంలోని లంక గ్రామాల్లోని పెదపులివర్రు–పెసర్లంక, ఓలేరు–పెసర్లంక, కోళ్లపాలెం–పెసర్లంక చప్టాల వద్ద నీరు చేరింది. ఆయా మార్గాల్లో తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. వరద మరింత పెరిగితే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం లంక గ్రామాల వాసులు వెల్లటూరు చిన రేవు హైలెవల్ వంతెన మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో స్థానికులు రేవులోకి వెళ్లవద్దని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు ఆదేశించారు. కరకట్టకు గండ్లు పడే ప్రమాదం ఉన్న ప్రాంతాలను గుర్తించి పటిష్టం చేయడమే కాక ఇసుక మూటలను సిద్ధం చేశామన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలిరావాలి

రేపల్లె: ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటిని అధికంగా విడుదల చేసిన నేపథ్యంలో నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన పెనుమూడి, పెనుమూడి పల్లిపాలెం గ్రామాలలో పర్యటించారు. పెనుమూడి, పల్లిపాలెంలను వరద చుట్టుముట్టే ప్రమాదం ఉన్నందున పెనుమూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పల్లిపాలెం వాసులు వెంటనే పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వరద ముప్పును ఎదుర్కొనడానికి సిద్ధం

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

కొల్లూరు: వరద ముప్పును అధిగమించడానికి ప్రజల సహకారంతో అహర్నిశలు శ్రమించి పనిచేయడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. కృష్ణా నదికి వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ గురువారం మండలంలోని దోనేపూడి, పెసర్లంక అరవిందవారధి, చిలుమూరులంక, సుగ్గునలంక లోలెవల్ వంతెనలను పరిశీలించారు. వరద సహాయక చర్యలపై తీసుకుంటున్న ముందస్తు చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిలుమూరులంకలో మూడు ఎస్టీ కుటుంబాలు వరదలకు నిర్వాసితులు కావడంతో వారికి ప్రభుత్వం తరపున చేపట్టిన సహాయ కార్యక్రమాల విషయంలో అధికారులు అశ్రద్ధగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులైన కుటుంబాలకు తక్షణం సురక్షిత ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహ నిర్మాణాలు చేపట్టడంతోపాటు, వారికి ఆధార్, రేషన్, ఉపాధిహామీ పథకం జాబ్ కార్డులు మంజూరు చేయించాలని ఆదేశించారు.

ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు

వరదల కారణంగా ప్రజలు, పశువులకు ప్రాణ నష్టం వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ చెప్పారు. వరద ప్రవహిస్తున్న మార్గాలు, ఇతర కీలక ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరద పెరిగితే వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, రోగగ్రస్తులను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి యుద్ధప్రాతిపదికన తగు చర్యలు చేపట్టడానికి కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 22 వరద ముంపు గ్రామాలలో ఇరువురు చొప్పున మండలస్థాయి అధికారులను, మండలానికో జిల్లా స్థాయి అధికారిని కేటాయించినట్లు చెప్పారు.



చిలుమూరులంకలో ఎస్టీ కుటుంబాల నుంచి వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి

నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లిస్తాం

వరదల కారణంగా పలు గ్రామాలలో వాణిజ్య పంటలు ముంపునకు గురైనట్లు గుర్తించామని కలెక్టర్ తెలిపారు. వరద నీటిలో మునిగిన పంటలను వరదలు తగ్గిన వెంటనే ఉద్యాన, వ్యవసాయ శాఖల ద్వారా పంట నష్ట అంచనాలు రూపొందిస్తామన్నారు. పంట నష్టానికి ప్రభుత్వం నిర్దేశించిన పరిహారం అందజేయడంతోపాటు, ఉచితంగా విత్తనాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

పంట భూముల కోతలు అరికట్టండి

వరదల కారణంగా పంట భూములు కోతలకు గురై నష్టపోతున్నామని మండలంలోని తిప్పలకట్ట ప్రాంతానికి చెందిన పలువురు రైతులు కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వరదల సమయంలో పంట భూములు కోతకు గురికాకుండా గతంలో నిర్మించిన విధంగా గ్రాయిన్స్ నిర్మాణం చేపట్టడంతోపాటు, నది ఒడ్డును పటిష్ట పరచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న లోలెవల్ వంతెన, సుగ్గునలంక వద్ద ఉన్న లోలెవల్ వంతెనలు రహదారి ఎత్తుకు పెంచి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్‌గౌడ్, రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి, కొల్లూరు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు, ఆర్‌సీ ఏఈ విజయ రాజు, ఎస్‌ఐ జానకి అమరవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోటు మీదున్న సముద్రం

కొల్లూరు: అమావాస్య దగ్గరలో ఉన్న నేపథ్యంలో పోటు మీదున్న సముద్రం వరద నీటి గ్రహించకపోవడంతో నష్ట తీవ్రత పెరుగుతుందని లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సముద్రం వైపు ప్రవహించాల్సిన కృష్ణా నది స్తబ్దుగా ఉండటంతో వరద నీరు భారీగా పల్లపు ప్రాంతాలలోకి చొచ్చుకుపోతుంది. గాజుల్లంక, దోనేపూడి, కొల్లూరు, ఆవులవారిపాలెం, పెసర్లంక, పోతార్లంక పరిసర గ్రామాల చుట్టుపక్కల మెరక ప్రాంతాలలోని పొలాల్లోకి వరద నీరు చేరడంతో పంటలు ముంపునకు గురయ్యాయి. పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల చుట్టూ వరద నీరు భారీగా చేరింది. శనివారం అమావాస్య ముగిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగిన పక్షంలో లంక గ్రామాలలో సాగులో ఉన్న పంటలకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

వరదలో వాణిజ్య పంటలు



చింతర్లంక వద్ద వరద నీటిలో అరటి తోట

కొల్లూరు: మండలంలోని వందల ఎకరాలలో వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. చింతర్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం, పోతార్లంక, తోకలవారిపాలెం, దోనేపూడి కరకట్ట దిగువ ప్రాంతం, కొల్లూరు కరకట్ట దిగువ ప్రాంతాలలో సుమారు 250 నుంచి 300 ఎకరాలలో అరటి, పసుపు, కంద, జామ, మొక్కజొన్న, బెండ, మునగ, బీర వంటి పంటలు వరద నీటిలో మునిగాయి. వరద మరింత పెరిగే సూచనలు ఉండటంతో మెరక భూములలోని పంటలు సైతం ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

ముంపులో ఇటుక పరిశ్రమ

కృష్ణా నది వరద ప్రభావం ఇటుక పరిశ్రమపై అధికంగా పడింది. కొల్లూరు, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాలలో ఇటుక బట్టీలలోకి వరద నీరు భారీగా చేరడంతో ఇటుక రవాణా నిలిచిపోయింది. పరిశ్రమలో ఇప్పటికే నిల్వ చేసిన మట్టి, ఊక, బొగ్గు, ఫ్లైయాష్ వంటి ముడి సరుకు వరద నీటిలో కొట్టుకుపోయే అవకాశం ఉండటంతో నష్టం తీవ్రత పెరుగుతుందని ఇటుక ఉత్పత్తిదారులు ఆందోళనకు గురవుతున్నారు. పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, కొల్లూరు గ్రామాల పరిధిలో ఇటుకల తయారీకి అవసరమైన మట్టి కోసం తవ్విన గుంతలలోకి వరద నీరు చేరడంతో పశువుల గ్రాసం ముంపునకు గురైంది.



భట్టిప్రోలు మండలం ఓలేరు నుంచి పెసర్లంక వద్ద చప్టాపై వరద నీటి ప్రవాహం



కొల్లూరు మండలం గాజుల్లంక వద్ద వరద నీటి ముంపుకు గురైన బెండ పంట



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద కరకట్ట పైకి ఎక్కించిన గొర్రెలు, మేకలు



కొల్లూరు మండలం పెసర్లంక గ్రామం గృహాల అంచుల వరకు చేరిన వరద నీరు

కదం తొక్కిన దివ్యాంగులు

- పింఛన్ల తొలగింపుపై ఆగ్రహం
- టవర్ ఎక్కి నిరసన తెలిపిన దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య
- మద్దతుగా నిరసనకు దిగిన దివ్యాంగులు
- ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- నాలుగు గంటలకు పైగా కొనసాగిన ఆందోళన
- బాధితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ
- ఆందోళన విరమించిన దివ్యాంగులు
- పలువురిపై కేసు నమోదు చేసిన పోలీసు

బాపట్ల: పింఛన్లు తొలగించటంతో ఆగ్రహించిన దివ్యాంగులు కదం తొక్కారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చి నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం దివ్యాంగుల జోలికి వస్తే సహించేదిలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున ధ్వజమెత్తారు. చల్లా రామయ్యకు మద్దతుగా మేరుగ నాగార్జునతోపాటు పార్టీ నాయకులు నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల పెన్షన్లు తొలగింపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సంచార జాతుల సంక్షేమ సంఘం నాయకుడు చల్లా రామయ్య గురువారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెల్ టవర్ ఎక్కారు. జిల్లాలో తొలగించిన 3824 దివ్యాంగుల పెన్షన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చేంతవరకు టవర్ దిగేది లేదని రామయ్య భీష్మించుకుని కూర్చున్నాడు. పింఛన్లు తొలగించిన కొందరు దివ్యాంగులు అక్కడకు చేరుకుని రామయ్యకు మద్దతు తెలిపారు. నూటికి నూరు శాతం కాళ్లు చచ్చుబడిపోయిన వికలాంగుడికి పెన్షన్ తొలగించడంపై ప్రజా సంఘాల నాయకుడు కే శరత్‌తో పాటు పలువురు వికలాంగులు అధికారులను నిలదీశారు. మండుటెండలో వికలాంగ బాలుడిని రోడ్డుపై పడుకోబెట్టి నిరసన తెలిపారు. పోలీసులు బాలుడిని బలవంతంగా అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌ను అడ్డుకునేందుకు యత్నించిన శరత్‌ను అరెస్టు చేసి వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహించిన వికలాంగులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శరత్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న మేరుగ నాగార్జున, చల్లా రామయ్య

పోలీసులతో వాగ్వాదం

చల్లా రామయ్యకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సెల్ టవర్ వద్ద నుంచి వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు తరిమికొట్టారు. ఎదురు తిరిగిన నలుగురిని బలవంతంగా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున నిరసన జరుగుతున్న ప్రదేశానికి చేరుకున్నారు. సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేద్దాం దిగి రమ్మని రామయ్యను కోరారు. ఎట్టకేలకు రామయ్య సెల్ టవర్ దిగారు. సెల్ టవర్ దిగిన వెంటనే చల్లా రామయ్యను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఆ సమయంలో మేరుగ నాగార్జునకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వివాదం జరిగింది. ఎట్టకేలకు మేరుగ నాగార్జునతో కలిసి చల్లా రామయ్య ఆర్డీఓ గ్లోరియాకు వినతిపత్రం అందజేశారు. వికలాంగుల నాయకులతో చర్చలు జరిపిన వారిలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, తహసీల్దార్ సలీమా, వికలాంగుల సంక్షేమ శాఖ పీడీ ఉన్నారు. అనంతరం రామయ్యను ఆసుపత్రికి తరలించారు. చల్లా రామయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాంబాబు తెలిపారు. అంతముందు శాంతిభద్రతను విఘాతం కలిగిస్తున్నారన్న కారణంతో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణ ఎస్సైలు విజయ్‌కుమార్, చంద్రావతి, పోలీసు సిబ్బంది అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. చల్లా రామయ్యకు సంఘీభావం తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మండల అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, నాయకులు కోకి రాఘవ రెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, తన్నీరు అంకమ్మరావు, శాయిల మురళి తదితరులు పాల్గొన్నారు.



టవర్ వద్ద నిరసన తెలియజేస్తున్న దివ్యాంగులు



శరత్ అనే దివ్యాంగున్ని తీసుకెళుతున్న పోలీసులు

ప్రభుత్వం తీరుమార్చుకోవాలి

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని పక్కన బెట్టి దివ్యాంగులు, వృద్ధుల పెన్షన్లు తొలగింపులే ప్రధాన అజెండాగా ముందుకెళుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చేతులు, కాళ్లు సక్రమంగాలేని వారిపై ప్రభుత్వం ప్రతాపం చూపటం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు ఇస్తే కూటమి ప్రభుత్వం వాటిని తొలగించేందుకే కంకణం కట్టుకుందన్నారు. దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందనే విషయాన్ని మరిచిపోవద్దన్నారు.

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ ఫ్లెక్సీ తొలగింపు



అశోక్‌బాబుతో చర్చిస్తున్న పోలీసులు

భట్టిప్రోలు(వేమూరు): భట్టిప్రోలు మండలం చింతమోటులో ఏర్పాటుచేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ఫ్లెక్సీలు తొలగించేందుకు అధికారులు సిద్ధంకాగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. గ్రామానికి చేరుకున్న అశోక్ బాబు గ్రామంలో ప్రభుత్వం అనుమతి లేని ఫ్లెక్సీలు అన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. వేమూరు, చుండూరు సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసరావు, భట్టిప్రోలు, కొల్లూరు ఎస్‌ఐలు శివయ్య, జానకీ అమర్‌వర్ధన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామంలో తెలుగుదేశం ఫ్లెక్సీలు, బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ఫ్లెక్సీలని తొలగిస్తే వెళ్లిపోతామని వరికూటి వారి స్పష్టం చేశారు. గ్రామాల్లో గొడవలు జరగకుండా పోలీసులు బాధ్యతలు తీసుకోవాలని కోరారు. పోలీసులు చట్టం ప్రకారం పనిచేయాలని కోరారు. ఫ్లెక్సీల వ్యవహారం పరిష్కారం చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పడమటి శ్రీనివాసరావు, బొల్లెదు ప్రతాప్, ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

28న విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినం

లక్ష్మీపురం: ఈ నెల 28వ తేదీన విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినాన్ని విద్యుత్ పోరాట ప్రతిజ్ఞ దినంగా జరుపుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజానీకంపై భారీ ఎత్తున విద్యుత్ భారాలు మోపిందని, అప్పట్లో వామపక్ష పార్టీల నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్తు చార్జీలు పెంచబోమని, భారం తగ్గిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కానీ అదనపు భారాలను ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతోను, ట్రూఅప్ చార్జీల పేరుతో మోపిందన్నారు. దీంతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా వేదిక ఆధ్వర్యంలో ప్రతిఘటన ఉద్యమం సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజానీకం ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 28వ తేదీన జరిగే ప్రతిజ్ఞ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

25న రజకుల ధర్నాను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: కూటమి నేతలు ఇచ్చిన ఎన్నికల హామీల అమలు కోసం ఈ నెల 25వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మందూరు వెంకట నరసయ్య గురువారం పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమ ప్రచార కరపత్రాలను సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేయడం లేదని, మంత్రులతో కూడిన సబ్ కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేస్తోందన్నారు. సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి వెంపాటి చిన్న కోండయ్య, సీతయ్య పాల్గొన్నారు.

వినాయకచవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

- ఆన్‌లైన్‌లోనే మండపాలకు అనుమతి
- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాపట్లటౌన్: వినాయకచవతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఎస్పీ తుషార్ డూడీ విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు, మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో మండపాలు, పందిళ్ల ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించుకునే భక్తుల సౌకర్యార్థం సులభంగా అనుమతులు పొందేందుకు సింగిల్‌విండో విధానాన్ని పోలీస్ శాఖ ప్రవేశపెట్టిందన్నారు. http://fanerhutrav.net అనే వెబ్‌సైట్‌ను పోలీస్ శాఖ ప్రారంభించిందన్నారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఈ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలన్నారు. దరఖాస్తుదారుడు పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. సంబంధిత పోలీస్ అధికారి స్వయంగా పందిరి, మండప స్థలాన్ని తనిఖీ చేస్తారన్నారు. నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) జారీ చేస్తారన్నారు. వినాయక ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతాపరమైన నియమ నిబంధనలు పాటిస్తూ జరుపుకోవాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో అనుమతి లేకుండా వినాయక మండపాలు, పందిళ్లు ఏర్పాటు చేయరాదన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ఇలా...

http://fanerhutrav.net వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి దరఖాస్తుదారుడు అతడి ఫోన్ నెంబర్ నమోదు చేయాలి.

- నిర్ధారణ కోసం దరఖాస్తుదారుడు ఫోన్ నెంబర్‌కు ఓ.టి.పి వస్తుంది, దానిని ఎంటర్ చేయాలి. వెంటనే దరఖాస్తు పత్రం వస్తుంది.
- దరఖాస్తు పత్రంలో వివరాలను పొందుపరిచి సబ్మిట్ చేయాలి.
- దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు వెళ్తుంది.
- సంబంధిత పోలీస్ అధికారి పందిరి, మండప స్థలాన్ని తనిఖీ చేస్తారు.
- నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌ఓసీ) జారీ చేస్తారు.
- నిరభ్యంతర పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాలి.
- పోలీస్ సిబ్బంది సందర్శన సమయంలో కోడ్‌ని స్కాన్ చేసి తనిఖీ చేస్తారు.

నీట్ పీజీలో మెరిసిన పూనూరు విద్యార్థి

జాతీయ స్థాయిలో 3716వ ర్యాంకు కైవసం



ర్యాంక్ సాధించిన శృతి

యద్దనపూడి: మెడికల్ విభాగంలో బుధవారం ప్రకటించిన నీట్ పీజీ పరీక్ష ఫలితాల్లో యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన డాక్టర్ ఐలవరపు శృతి జాతీయ స్థాయిలో 3716వ ర్యాంకును సాధించారు. మొత్తం 2,42,000 మంది అభ్యర్థులు రాసిన నీట్ పీజీ ఎంట్రన్స్ పరీక్షలో శృతి 3716వ ర్యాంక్ సాధించారు. పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసిన శృతి మొదటి నుంచి చదువులో అగ్రగామిగా ఉండేవారు. 2018 నీట్ యూజీ ఎంట్రన్స్ పరీక్షలో రాష్ట్ర స్థాయి మొదటి పది మంది విజేతల్లో ఒకరుగా నిలిచి గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గైనకాలజీ పూర్తి చేయటం ద్వారా పేద ప్రజలకు సేవలు అందించటం తన లక్ష్యమని శృతి తెలిపారు. శృతి తండ్రి హనుమంతరావు ఆరోగ్య శాఖలో ఉద్యోగి కాగా తల్లి హిమబిందు ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రులు, సోదరి ప్రణయ, పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

నీట్ పీజీలో 5850 ర్యాంక్ సాధించిన రాచూరు వాసి



దీవి శ్రీ సాయి హేమంత్

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం రాచూరు గ్రామానికి చెందిన దీవి శ్రీసాయి హేమంత్ నీట్ పీజీ 2025లో 578 మార్కులు 5850 (ఆల్ ఇండియా) ర్యాంక్ సాధించారు. 2018లో నీట్ ఎంట్రన్స్ పరీక్షలో నేషనల్ 20 వేలు, రాష్ట్రంలో 1011 ర్యాంక్ సాధించాడు. గుంటూరు కాటూరి మెడికల్ కాలేజీలో ఉచిత సీట్ పొంది 2018–2024లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. హేమంత్ తండ్రి శ్రీనివాస హరికుమార్ న్యాయవాదిగా, తల్లి అనంత శైలజ సచివాలయ మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. హేమంత్‌ను తాత విశ్రాంత తెలుగు పండిట్ దీవి వేంకట లక్ష్మీ నరసింహాచార్యులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

23 నుంచి గోవాడలో కోటి కుంకుమార్చన





అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడ శైవ క్షేత్రమైన శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర శ్రావణ బహుళ అమావాస్య నుంచి 11 అమావాస్యలు పురస్కరించుకుని కోటి కుంకుమార్చన, సామూహిక లలిత పారాయణ మహోత్సవం జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి బి. అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 23న సెప్టెంబర్, అక్టోబర్ 21న, నవంబర్, డిసెంబర్ 19న, 2026 జనవరి 18న, ఫిబ్రవరి 17న, మార్చి 18, ఏప్రియల్ 17న, మే 16న, జూన్ 14న అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకట శ్రీనివాసశర్మ, అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ, ప్రత్తిపాటి రామకోటేశ్వరరావు తెలిపారు. ప్రతి నెలా 10 లక్షల పారాయణ, కుంకుమార్చన, అమ్మవారికి శ్రీ సూక్త సహిత దేవి ఉపనిషత్తులతో అభిషేకం, కుంకుమార్చన, దేవి హోమం, కుష్మాండ పూజ, కూష్మాడబలి పూజా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కోటి కుంకుమార్చన కమిటీ, సహాయకులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

23న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ధర్నా

లక్ష్మీపురం: జీవో నంబర్ 77ను రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయంబర్స్‌మెంట్ అందించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల బకాయిలను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా పోస్టర్‌ను గురువారం గుంటూరు బ్రాడీపేటలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెస్ బిల్లులు పెంచాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, హాస్టల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సౌమ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం

- రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు అగస్టీన్



మాట్లాడుతున్న అగస్టీన్

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు ఇవ్వకపోగా... ఉన్న దివ్యాంగ పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బొక్క అగస్టీన్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో దివ్యాంగ విభాగం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి తర్వాత రాష్ట్ర ప్రజలను ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. ఎన్నికల హామీలో మాత్రం రూ.6 వేలు పింఛను ఇస్తామని చెబితే సంబరపడ్డామని.. ఇప్పుడు నిర్దయగా తీసేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 80 శాతం వైకల్యం ఉంటే ఇప్పుడు 40 శాతం ఉన్నట్లు చూపించి పింఛన్లు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన వారికి కూడా మొండిచేయి చూపడం ఎంతవరకు సమంజసం అన్నారు. రీ వెరిఫికేషన్ పేరుతో ఆసుపత్రులకు, ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీని వల్ల దివ్యాంగులు కార్యాలయాల మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.

నాడు అండగా వైఎస్ జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దివ్యాంగులకు అండగా నిలిచారు. 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి తమ కష్టాలను తీర్చారని దివ్యాంగులు పేర్కొన్నారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ తీసేయడంతో ఏ పని కావాలన్నా కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వారి కోసం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులతో కలిసి నిరసన చేపడతామన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన విధంగానే దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దాసరి గణేష్‌బాబు, కొమ్మా లింగరావు, శంకర్, జె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

మర్రిపాలెం (విశాఖ జిల్లా): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఊహించని మలుపు చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారులో గంజాయిని గుర్తించిన పోలీసులు, ఆ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఐదవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ నెల 12న సుభాష్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కారు ఢీకొని ఏడాదిన్నర చిన్నారి వర్షిత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ ఆర్ముగంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు కారులో ఉన్న మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు ఈ నెల 16న సీజ్ చేసిన కారును తనిఖీ చేయగా.. 21 కిలోల గంజాయిని గుర్తించారు. పరారీలో ఉన్న ముగ్గురినీ అరెస్ట్ చేశారు. వారిని హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న గుంటూరుకు చెందిన అక్షయ గౌతమి(20), షేక్ మహమ్మద్ జాకీర్ (19), ఒంగోలుకు చెందిన పెర్లి విజయవర్ధన్ రాజు (25)గా గుర్తించినట్లు సీఐ తెలిపారు. వీరు విజయవాడలో కారు అద్దెకు తీసుకుని అరకు వెళ్లి గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా ఊర్వశి జంక్షన్ సమీపంలోని సుభాష్‌నగర్ వద్ద ప్రమాదం జరిగింది. పెర్లి విజయవర్ధన్ రాజుపై ఇప్పటికే ఒంగోలులో 11 కేసులు ఉన్నాయని, మహమ్మద్ జాకీర్‌పై కూడా గంజాయి కేసు ఉందని పోలీసులు వెల్లడించారు. యువతికి తల్లిదండ్రులు లేరు. విజయవర్ధన్‌కు బంధువు కావడంతో అతనితో ఇలా వెళ్తూ ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎస్‌ఐలు షేక్ సమీర్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

ప్రైవేటు వెంచర్‌లో డస్ట్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన



కార్మికుడి మృతదేహం

తాడికొండ: హై టెన్షన్ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన తాడికొండ అడ్డరోడ్డులో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడికొండ అడ్డరోడ్డులోని ఓ ప్రైవేటు వెంచర్‌లో బెంజ్ లారీ నుంచి డస్ట్ అన్‌లోడ్ చేసేందుకు పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు తప్పించబోయాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్ తగిలినట్లు సమాచారం. ఘటనా స్థలంలోనే కార్మికుడు కుప్పకూలడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై ఇప్పటి వరకు పోలీస్‌స్టేషన్‌కు ఎలాంటి సమాచారం అందలేదు.



ప్రమాదానికి కారణమైన విద్యుత్ తీగెలు

పొగాకు పంటకు ప్రత్యామ్నాయం అపరాలు

ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ డైరెక్టర్

అద్దంకి: పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు సాగు చేసుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. 'ఆత్మ' ప్రకాశం జిల్లా సౌజన్యంతో కొంగపాడులో వివిధ పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, జొన్న పంటలు సాగు చేయాలని సూచించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మురళీధర్ నాయక్ మాట్లాడుతూ మినుము, కంది, పెసర, శనగ పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.ఉష మాట్లాడుతూ అపరాల పంటలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని.. రసం పీల్చే పురుగుల నివారణ కోసం విత్తన శుద్ధి చేయాలని సూచించారు. ఉప్పునీటి యాజమాన్యం శాస్త్రవేత్త కె. మృదుల మాట్లాడుతూ అపరాలు.. మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు గురించి తెలియజేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఎఫ్రాయిం మాట్లాడుతూ కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం బర్లీ పొగాకు సాగు చేయవద్దని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ రామిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిబాబు, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, గుడిపూడి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రిస్కిల్ల, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు అందజేస్తున్న బాధిత మహిళలు

రేపల్లె: రేపల్లె పట్టణంలో అధిక వడ్డీలు కట్టాలని వేధింపులకు గురిచేస్తున్న మైక్రోఫైనాన్స్ సంస్థల నుంచి బాధితులకు రక్షణ కల్పించాలని బాధిత మహిళలు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆఫీసుల ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్.మణిలాల్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఇళ్ల పట్టాల మీద లోన్ ఇస్తామని పేదలను నమ్మించి ఇంగ్లీషులో ఉన్న అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు చేయించుకొని అధిక మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తూ ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని విమర్శించారు. 12 శాతానికి మించి వడ్డీ వసూలు చేయరాదని నిబంధనలు ఉన్నప్పటికీ 30 శాతం వరకు వసూలు చేస్తూ పేదలను పీడిస్తున్నారన్నారు. రాత్రి ఆరు గంటల తర్వాత లోన్ రికవరీ పేరుతో మహిళలకు ఫోన్ చేసి వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధిత మహిళలు సింధు దేవి, తిరుపతమ్మ, కృష్ణంరాజు, దుర్గాప్రసాద్, మోషే, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు
- పర్చూరు మార్కెట్ యార్డులోని పొగాకు కొనుగోలు కేంద్రం సందర్శన



కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, అధికారులు

పర్చూరు(చినగంజాం): పొగాకు రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం రైతులందరినీ ఆదుకుంటుందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. పర్చూరు మార్కెట్ యార్డు పరిధిలోని నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. గోదాముల్లో నిలువ ఉంచిన పొగాకు పరిశీలించారు. పొగాకు రైతులకు బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్న సమయంలో కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పొగాకును కొనుగోలు చేస్తోందన్నారు. పొగాకు నాణ్యతను బట్టి మూడు గ్రేడులుగా విభజించి రైతులకు గిట్టుబాటు ధలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 7754 మంది రైతుల వద్ద మార్క్‌ఫెడ్ సంస్థ సుమారు రూ.100 కోట్లతో 13100 మెట్రిక్ టన్నులు పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా మేనేజర్‌లు నరసింహ, రమేష, పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు మేలు



భీమవరంలో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలిస్తున్న డీహెచ్ఓ వెంకట్రావు తదితరులు

మాచవరం : ఉద్యాన పంటల సాగుతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం, పిన్నెల్లి, వేమవరం గ్రామాల్లో ఆయన పర్యటించారు. మిరప, జామ, డ్రాగన్ ఫ్రూట్ పంటలను పరిశీలించారు. రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.మిరప, కూరగాయలు, ఆయిల్ పామ్ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ, యాజమాన్యం పద్ధతుల గురించి రైతులకు తెలియజేశారు. ఎండు తెగులు ఆశించిన జామ చెట్లకు 1గ్రా. కార్బెన్‌డజిమ్ లేదా 3గ్రా.కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి చెట్టు మొదట్లో పోయాలని తెలిపారు. జింక్, మెగ్నీషియం ధాతు లోప నివారణకు 2గ్రా. జింక్ సల్ఫేట్, 2గ్రా. మెగ్నీషియం సల్ఫేట్, 10 గ్రా. యూరియా లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల హార్టీకల్చర్ ఆఫీసర్ అంజలి బాయి, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ కరుణ కుమారి, ప్రభాకర్ రెడ్డి, సాగర్ బాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ కోసం చట్టం అవసరం

ప్రభుత్వాన్ని కోరిన సంఘ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

నరసరావుపేట: వెనకబడిన తరగతుల(బీసీ)పై రోజురోజుకూ దాడులు, వివక్ష, దౌర్జన్యం, సామాజిక బహిష్కరణకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రక్షణ చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ఏపీ బీసీ సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ పేర్కొన్నారు. ట్రయాండ్ సిటీ హోటల్‌లో గురువారం నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం నాయకుల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక చట్టం వల్ల బీసీలకు రక్షణతో పాటు వారిపై వివక్షను సమూలంగా అరికట్టగలదని నమ్మకం వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, నామినేషన్ పనుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం నియమించిన అన్ని కమిషన్లు రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీలు సామాజికం, ఆర్థికం, రాజకీయంగా వెనకబాటులో ఉన్నారని పేర్కొన్నాయని తెలిపారు. బీసీ నిరుద్యోగుల కోసం ఎస్సీ, ఎస్టీల మాదిరి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకుల విద్యాలయాలు, స్టడీ సర్కిళ్లు, వసతి గృహాలను సకల సౌకర్యాలతో నిర్మించాలని కోరారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ఈపూరు విద్యుత్ సిబ్బంది సత్తా



టీంను అభినందిస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

ఈపూరు(శావల్యాపురం): రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో ఈపూరు మండల విద్యుత్ సిబ్బంది పల్నాడు జిల్లా టీం తరఫున ప్రథమ బహుమతి సాధించడం అభినందనీయమని నరసరావుపేట ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో గురువారం పోటీల్లోని విజేతలు పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, కంచర్ల ఏడుకొండలు, సన్నిబోయిన రామాంజినేయులు, అచ్యుత్, మల్లికార్జున్‌లను అభినందించారు. ఎస్ఈ మాట్లాడుతూ అంకితభావంతో విధుల నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణించటం ప్రశంసనీయమని తెలిపారు. మానసిక వికాసం, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని పేర్కొన్నారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పిన్నబోయిన వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు క్రీడా దుస్తులు అందజేశారు.